సాక్షి మంచిర్యాల

మంగళవారం ı 12 ı నవంబర్ ı 2024



నేత్రపర్వం.. గోదావరి హారతి

బాసరలో సోమవారం గోదావరి హారతి వైభవంగా నిర్వహించారు. పుష్కర్ ఘాట్ వద్ద శివలింగాలకు ఋషి కుమారులతో అభిషేకం, అర్చన పూజలు జరిపించారు.

8లో ▸



గూడెంలో సత్యనారాయణ వ్రతాలు

దండేపల్లి: కార్తిక మాసం సందర్భంగా గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం 486జంటలు సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. సత్యదేవుణ్ని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.


మెనూ మారలేదు..!



ఎస్సీ వసతిగృహంలో చికెన్‌తో భోజనం



మాత పేరిట సరఫరా చేసిన కారంపొడి



జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల వసతిగృహంలో చికెన్‌కు బదులు ఆకుకూర పప్పు

- వసతిగృహాల్లో డైట్‌చార్జీలు పెరిగినా పాతదే అమలు
- కొత్త ఆహార పట్టిక అమలులో తాత్సారం

మంచిర్యాలఅర్బన్: సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్‌చార్జీలు పెంచినా కొత్త ఆహార పట్టిక(మెనూ) అమలులో తాత్సారం జరుగుతోంది. మెనూ అమలులో ఒక్కోచోట ఒక్కో తీరుగా వ్యవహరిస్తుండడంతో మరింత నాణ్యమైన ఆహారం అందుకుండా పోతోంది. నవంబర్ ఒకటి నుంచి మెనూ అమలులోకి వచ్చినా పౌష్టికాహారం ఉండే భోజన మెనూ తయారీపై నిర్లక్ష్యం వీడడం లేదు. ఎస్సీ వసతిగృహాల్లో తప్ప బీసీ, ఎస్టీ వసతిగృహాలు, మైనార్టీ గురుకులాల్లో మెనూ పట్టిక తయారు చేయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది. బీసీ హాస్టళ్లలో మౌఖికంగా ఆహార పట్టికపై ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో ఇంకా పాత మెనూతోనే సరిపెడుతున్నారు. వసతిగృహాలు, గురుకులాల్లో 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1,330, 8వ తరగతి నుంచి 10వరకు రూ.1,100 నుంచి రూ.1,540, ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100 వరకు పెరిగాయి. ఈ లెక్కన దాదాపు రూ.400 నుంచి రూ.600 వరకు ఇంకా పెరిగాయి. అయినా కొన్ని చోట్ల పాత మోనూనే అమలు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 23 ఎస్సీ వసతిగృహాల్లో డైట్‌చార్జీలు పెరగ్గానే మెనూ అమలుపై దృష్టి సారించారు. రోజు విడిచి రోజు కోడిగుడ్డు, అరటిపండు, ఒక్క రోజు చికెన్ పెట్టారు. ప్రస్తుత మారిన మెనూ ప్రకారం ఐదు కోడిగుడ్లు, ఆరు రోజులు అరటిపండ్లు, రెండ్రోజులు చికెన్, ప్రైమరీలో ఆరు అరటిపండ్లు, ఆరు కోడిగుడ్లు, ఒక్క రోజు చికెన్ అందిస్తున్నారు.

- 16బీసీ వసతిగృహాల్లో ఇదివరకు మూడు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు అరటిపండ్లు రోజు విడిచి రోజు పిల్లలకు అందించగా.. కొత్త మెనూలో ఒక కోడిగుడ్డు, అరటిపండుతోపాటు కొత్తగా గుడ్‌డే బిస్కెట్ మాత్రం ఒకటి చేర్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల వసతిగృహాన్ని ఆదివారం మధ్యాహ్నం 'సాక్షి' సందర్శించగా.. చికెన్‌కు బదులు ఆకుకూర పప్పుతో సరిపెట్టారు. మెనూ ఇష్టానుసారం మార్చడానికి వీలులేదు. కానీ ఎవరైనా హాస్టల్‌కు వెళ్తే ఉదయం వండాల్సింది సాయంత్రం పెడతామంటూ సర్దిచెప్పడం పరిపాటిగా మారింది. 70మంది విద్యార్థులకు సరిగ్గా రెండు కిలోలకు అటు ఇటుగా పప్పు పాత్రలో వేసి ఉడికిస్తుండడం చూస్తే విద్యార్థులకు ఎలా సరిపోతుందో అధికారులకే తెలియాలి. రూ.600 డైట్‌చార్జీలు అదనంగా పెరిగినా ఒక కోడిగుడ్డు, అరటిపండు పెంచకుండా ఒక్క రోజు చికెన్, బిస్కెట్‌ను కొత్త మెనూలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. ఎస్సీ వసతిగృహాల్లో ఇదే డైట్‌చార్జీలతో ఒక్క రోజు అదనంగా అందిస్తుండగా వీరికి గిట్టుబాటు కాదని ఓ అధికారి చెప్పుకొచ్చారు. భోజనం కూడా అరకొరగానే వడ్డించడం చూస్తే పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వస్తువుల సరఫరాలో కూడా..

వసతిగృహాలు దక్కించుకున్న టెండర్‌దారు వస్తువుల సరఫరాలో నాణ్యతలేనివి ఇస్తున్నారు. టెండర్ సమయంలో చెప్పింది ఒక్కటి.. సరఫరా చేస్తున్నది మరొకటిలా మారింది. ఇటీవల కొన్నింటికి ఎంటీఆర్ కారంపొడి, పసుపునకు బదులు మాత బ్రాండ్, విజయకు బదులు అల్పా నూనె సరఫరా చేశారు. ఇదేంటని అడిగితే సరుకులను మార్చి పంపించినట్లు తెలుస్తోంది. విజయ పాలకు బదులు టెట్రా పాలు(నిల్వపాలు) వినియోగిస్తున్నారు. ఆయా వసతిగృహాల్లో సరుకుల స్టాక్, విద్యార్థుల సంఖ్య గందరగోళంగా మారింది. నిరంతరంగా అందుబాటులో ఉండాల్సిన వార్డెన్లు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్న వారు లేకపోలేదు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందాలంటే అధికారులు కొత్త మెనూపై దృష్టి సారించాలి.

ఇంచార్జి వార్డెన్లతో..

బీసీ వసతిగృహాల వార్డెన్లకు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడేసి హాస్టళ్ల ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. పక్క పక్క మండలాలకు చెందిన వారికి కాకుండా దూరంగా ఉండే వారికి అప్పగించడం వల్ల పర్యవేక్షణ ఎలా ఉంటుందో తెలియకుండా పోతోంది. వార్డెన్లు పక్క జిల్లా నుంచి వచ్చి వెళ్తుంటారనే ఆరోపణలు లేకపోలేదు. మంచిర్యాల వార్డెన్ ఒకరికి చెన్నూర్‌లో రెండు, మరొకరికి జైపూర్, బెల్లంపల్లికి చెందిన వార్డెన్‌కు లక్సెట్టిపేట ఇవ్వడం వల్ల అవకాశంగా మారుతోంది. నిరంతరం వసతిగృహంలో ఉంటేనే పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉంటుండగా అదనపు బాధ్యతల వల్ల ఏదో చోట ఉన్నామంటూ తప్పించుకుంటున్నారు. ఎస్సీ వసతిగృహాల్లో కూడా చెన్నూర్, బెల్లంపల్లి వైపు ఒకటి రెండు చోట్ల సరిగ్గా మెనూ అమలు చేయడం లేదని తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎస్టీ వసతిగృహాల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. బాలుర వసతిగృహంలో అన్నింటికీ సీనియర్ విద్యార్థులతోనే చక్కబెడుతున్నట్లు తెలుస్తోంది. బాలికల వసతిగృహంలో ఫుడ్‌పాయిజన్ కావడం తెలియంది కాదు. మెనూ అమలుపై ఆయా శాఖల పర్యవేక్షణ అధికారులున్నా అటు వైపు చూస్తున్న సందర్భాలు తక్కువ. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

కచ్చితంగా అమలు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మెనూ(ప్రోటిన్‌ఫుడ్) వచ్చేంత వరకు తాత్కాలికంగా జిల్లా స్థాయిలో రూపొందించిన మెనూ కచ్చితంగా అమలు చేయాలి. బుధవారం, ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులకు చికెన్ అందించాల్సిందే. ఇతర వసతిగృహాల్లో టెండర్ల ధరలు, బీసీ గృహాల్లో టెండర్ ధరల్లో వ్యత్యాసం ఉంది. అందుకే నాలుగు కోడిగుడ్లు, అరటిపండ్లు, బిస్కెట్‌తోపాటు గ్రాముల ఆహారం పెంచి పౌష్టికాహారం అందేలా పట్టిక తయారు చేశాం. టెండర్‌లో ఆమోదం పొందిన సరకులు మాత్రమే సరఫరా చేయాలి. నాణ్యమైన (బ్రాండెడ్) సరుకులు పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవు.

– వినోద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి(డీబీసీడీవో)

న్యూస్‌రీల్

పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలక్రైం: బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. స్థానిక పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చాలామంది బడీడు పిల్లలు కూలీ పనులకు వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నాయని, మధ్య తరగతి ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఈ గంగాధర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఈ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్పీడీసీఎల్ విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్(ఎస్‌ఈ)గా గంగాధర్ సోమవారం స్థానిక ఎస్‌ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నెల 6న బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్‌ఈ ఎన్.శ్రావణ్‌కుమార్ కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న గంగాధర్‌ను జిల్లాకు కేటాయించారు. కొంత మేరకు జిల్లాకు రావడానికి వెనుకడుగు వేసినా ఉన్నతాధికారుల ఆదేశాలతో బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఈ కార్యాలయంలో జిల్లాలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది, యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇంచార్జిగా శ్రీవాణి



శ్రీవాణి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్(ఔషధ గిడ్డంగి) ఇంచార్జిగా శ్రీవాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నిర్వహిస్తుండగా, మంచిర్యాల జిల్లాకు సకాలంలో మందుల సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రతీ జిల్లాకు ఒక సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనతో మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నిర్వహణకు సిద్ధం చేశారు. గతంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కరీంనగర్ డీసీహెచ్ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీవాణిని డ్రగ్ స్టోర్ ఇంచార్జిగా నియమించగా, ఆమె విధుల్లో చేరారు.

మద్దతు ధరపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

కోటపల్లి: పత్తి, వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర పొందడంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం మండలంలోని మల్లంపేట రైతు వేదికలో రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లోనే నాణ్యత ప్రమాణాలు వచ్చే వరకు ఆరబెట్టి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ సీజన్ నుంచి ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్‌గా ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవోలు వైష్ణవి, అనూష, రాజుకుమార్, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ఆజాద్ 136వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను పటిష్టం చేస్తూ ఐఐటీలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపనకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమాధికారి నీరటి రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్–3 పరీక్షకు సర్వం సిద్ధం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 17, 18న గ్రూప్–3 పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం, మధ్యాహ్నం, 18న ఉదయం పరీక్ష నిర్వహిస్తామని, 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 15,038 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షకు నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, ప్రాంతీయ సమన్వయకర్తగా నరేందర్‌రెడ్డిలను నియమించామని తెలిపారు.

'మహిళల భద్రత కోసమే పోలీసులు'



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మహిళల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పని ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, పిల్లలపై దృష్టి అవగాహన వాల్ పోస్టర్లను షీటీమ్ సిబ్బందితో కలిసి సోమవారం రామగుండం కమిషనరేట్‌లో విడుదల చేశారు. సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు, బాలికలు, యువతుల సమస్యలు, రక్షణ కల్పించడం కోసమే ప్రత్యేకంగా షీ టీమ్ బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. సమస్యలు, వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చని, పేర్లు గోప్యంగా ఉంచుతామని, డయల్ 100, షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ(అడ్మిన్) రాఘవేంద్రరావు, మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమ, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచకూడదు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం ప్రజాదర్బార్, జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదని, సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, విద్యుత్, పరిహారం, ఉపాధి, ఉద్యోగ, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజాదర్బార్, జిల్లా ప్రజావాణి ఫిర్యాదులు ఇంకా పెడింగ్‌లో ఉన్నాయని, తమ పరిధిలో పరిష్కారం కాకపోతే కాదని చెప్పాలని అన్నారు. కోర్టులో, న్యాయ సమస్యలు ఉన్నవి కాదని వివరణ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

- మూడెకరాల వ్యవసాయ భూమి ఉందని, బ్యాంకు అధికారులు పంట రుణం ఇవ్వడం లేదని, రైతుబంధు రావడం లేదని కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన వేల్పుల లింగవ్వ ఫిర్యాదు చేసింది.
- భర్త చనిపోయాడని, కుమారుల పోషణ భారంగా మారిందని, ఇంటర్ వరకు చదివానని, అవుట్‌సోర్సింగ్ లేదా ఉపాధి కల్పించాలని జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన అజ్మీర స్వప్న కోరింది.
- దివ్యాంగురాలినైన తనకు 70శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారని, ఐదేళ్ల వరకే ఉండడంతో ఐదు నెలలుగా పింఛన్ రావడం లేదని హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన బోయిన అమ్మక్క వినతిపత్రం అందజేసింది. సదరం స్లాట్ బుక్ కావడం లేదని, వేలిముద్రలు రాక బియ్యం పోయడం లేదని తెలిపింది.

కొడుకులు చూసుకోవడం లేదు..



నాకు ఇద్దరు కొడుకులు తిరుపతి, బాపు. నా కొడుకులు నన్ను చూడడం లేదు. తిండి పెట్టడం లేదు. అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బిడ్డల దగ్గర అక్కడక్కడ తలదాచుకోవాల్సి వస్తుంది. జీవనం కష్టంగా మారింది. నన్ను ఆదుకోవాలి.

– ఎల్కటూరి చిన్నమల్లయ్య, గ్రామం: కుందారం, మం: జైపూర్

సర్వే వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

- జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య
- మంచిర్యాలలో సర్వే పరిశీలన



మంచిర్యాలలో సర్వేను పరిశీలిస్తున్న కృష్ణ ఆదిత్య

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 5, 27వ వార్డుల్లో సర్వేను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఇళ్ల జాబితా ప్రక్రియ పూర్తయిందని, కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత నమూనాలో నమోదు చేయాలని తెలిపారు. ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు ముందు రోజే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

జైపూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. మండలంలోని షెట్‌పల్లిలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. సన్న, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలని, వెంటనే మిల్లులకు తరలించాలని, 48గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, తహసీల్దార్ వనజారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామని, ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల వాణి, సునిత మాట్లాడుతూ వేతనం రూ.9,750 మాత్రమే ఇస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచడం లేదని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా రూ.18 వేలు వేతనం, ఉద్యోగ భద్రత, కొత్త ఆశాల నియమాకం, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు వెయిటేజీ మార్కులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునిత, లీల, సుజాత, స్వప్న, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల ధర్నా



ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ, వీఓఏ, ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఓఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట 48 గంటల మహాధర్నా చేపట్టారు. వీఓఏలు మాట్లాడుతూ కనీస వేతనం, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. సెర్ప్ నుంచి రూ.5 వేలు మాత్రమే గౌర వ వేతనం చెల్లిస్తున్నారని, గ్రామ గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా కనీస వేత నం రూ.26 వేలు, ప్రతీ నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కన్నుల పండువగా కార్తిక దీపోత్సవం



బెల్లంపల్లి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవ సహిత లక్ష పుష్పార్చన కన్నుల పండువగా నిర్వహించారు. వినోద్ ఆయన సతీమణి రమ పూజల్లో పాల్గొన్నారు. ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రీ ప్రవచనాలు చేశారు. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే వినోద్ తనయ వర్ష, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మాజీ చైర్‌పర్సన్ స్వరూప, రమేష్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వినోద్, సతీమణి రమ

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మున్సిపాలిటీ పరిధిలోని ఫిర్దోస్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఇసాక్ కొద్ది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కాళేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రెండు తులాల బంగారం, రూ. 10 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఐపీ విభాగం ముందు గల ఆవరణలో 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు రిమ్స్ సిబ్బంది తెలిపారు. అతని వద్ద ఉన్న పేపర్లలో ఆదిలాబాద్‌కు చెందిన నీలయ్యగా రాసి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తీసుకెళ్లాలని సిబ్బంది కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ శివారు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విజయనగర్ కాలనీ బోర్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అదే ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ వద్ద 115 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయి. నార్కోటిక్ డ్రగ్స్ యాక్ట్ 1985 ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక సీఐ ప్రమోద్‌రావు, ఎక్సైజ్ ఎస్సైలు శంకర్, సిబ్బంది లచ్చన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్


పట్టుకున్న కొండచిలువ

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని గోలం లక్ష్మికి చెందిన పెరట్లో సోమవారం 10 అడుగుల కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బెల్లంపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ దినేష్‌ను పిలిపించారు. అతను కొండచిలువను పట్టుకొని జోగాపూర్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నెల రోజుల క్రితం డీజే మల్లేశ్ ఇంటి ఆవరణలో రెండు కొండచిలువలు కోళ్లను మింగి యజమాని చేతిలో హతమయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భారీ కొండచిలువ ఇనుప కంచెలో చిక్కుకుని గాయాలపాలైంది. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.


గోదావరికి హారతి ఇస్తున్న వేద పాఠశాల విద్యార్థులు


హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


మహిళలు వెలిగించిన కార్తిక దీపాలు

నేత్రపర్వం.. గోదావరి హారతి

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో శ్రీవేద భారతి పాఠశాల వ్యవస్థాపకులు శ్రీవేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో సోమవారం గోదావరి హారతి నిర్వహించారు. పుష్కర్ ఘాట్ వద్ద ముందుగా శివలింగాలకు ఋషి కుమారులతో అభిషేకం, అర్చన పూజలు జరిపించారు. అనంతరం చతుర్దశ భువన విశేష గంగా హారతి ఇచ్చారు. అనంతరం రుద్ర హోమం, రుద్రాభిషేకం, ఆకాశ దీపం, దీపోత్సవం, శివ పార్వతి కల్యాణం నిర్వహించి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. సరస్వతీదేవి ఆలయంలో ప్రదోషకాల నిత్య దీపోత్సవం నిర్వహించారు.

– బాసర (ముధోల్)

శారీరక దృఢత్వానికి క్రీడలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

• ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అండర్ 14, 17, 19 జోనల్ స్థాయి పోటీలు ముధోల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలకు ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులపాటు నిర్వహించనున్న పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర జోనల్ అధికారి పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, గురుకుల ప్రిన్సిపాల్ చల్ల నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

దండేపల్లి(మంచిర్యాల): పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు దండేపల్లి మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో, మంచిర్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమ నిర్వహణకు తాళ్లపేట వర్తక సంఘం అధ్యక్షుడు రమణయ్య, నాయకపోడ్ సేవాసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మార్నేని భూమేష్ సహకరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన సునీత కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన భీంరావు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, ఇంద్రవెల్లి మండలం వడ్గాం గ్రామానికి చెంది రాంశావ్ ఎడ్ల జత మంజూరు చేయించాలని కోరారు. ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏవో దామోదర్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చెన్నూర్: మండలంలో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసులో సోమవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నూర్ మండలంలోని ముత్తరావుపల్లికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను పైడిపల్లి మల్లయ్య కుమారుడు రాజశేఖర్ ఏడునెలల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో భూమయ్య రాజశేఖర్, సౌందర్యను హతమార్చాలని నిర్ణయించుకుని హైదరాబాద్‌లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ముత్తరావుపల్లికి తిరిగి వచ్చాడు. కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా హత్యచేస్తే తిరిగొస్తారని గ్రహించి ఈ నెల 9న తెల్లవారుజామున రాజశేఖర్ తండ్రి పైడిపల్లి మల్లయ్య కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లగా విషయం తెలుసుకున్న భూమయ్య అతన్ని వెంబడించి కొడవలితో దాడిచేసి హతమార్చాడు. నిందితుడు పారిపోయి చెన్నూర్‌లో తలదాచుకున్నాడు. సోమవారం మంచిర్యాలకు వెళ్లేందుకు కిష్టంపేట జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద హత్యకు ఉపయోగించిన కొడవలి, నేరం జరిగిన సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల్లో హత్య కేసు ఛేదించిన సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు టీకయ్య, భూమన్న, రాజశేఖర్, హోంగార్డు ఖాదిర్‌ను అభినందించారు.

క్రీడాకారులు గెలుపు కోసం కృషి చేయాలి


పోటీలు ప్రారంభిస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): క్రీడాకారులు పోటీల్లో గెలుపుకోసం కృషి చేయాలని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. పోటీల్లో కాళేశ్వరం జోన్ పరిధిలోని 15 కళాశాలల నుండి 1,275 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సింగరేణి తిలక్‌స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో అండర్–19 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.ప్రభాస్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

జోనల్ క్రీడలు


మార్చ్‌ఫాస్ట్‌లో నిర్మల్ జిల్లా లెఫ్ట్‌పోచంపాడ్ క్రీడాకారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల 10వ జోనల్ క్రీడా పోటీలు సోమవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కంజర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించారు. జాతీయ, సొసైటీ, స్పోర్ట్స్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన స్వాగతోత్సవ నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించాయి.

నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు

నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో 1200 మంది విద్యార్థినులు అండర్ 14, 17, 19 విభాగాల్లో పాల్గొననున్నారు. 14 గురుకులాల నుంచి 9 రకాల క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో సాతుకు కిషోర్‌కుమార్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ టెండల్ బృందంతో పనికి వెళ్లిన కార్మికుడు ఉదయం షిఫ్టులో గనిలో 4సీం 11డిస్ట్రిక్, 15డిప్ 30 లెవెల్‌లో కిందపడడంతో గాయాలయ్యాయి. పంపు లాగే ట్రాలి వస్తుందా అని చూసేందుకు వెళ్లిన కిషోర్ ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో మిగతా కార్మికులు వెళ్లి చూసేసరికి కదలలేని స్థితిలో పడి ఉన్నాడు. భారీ యంత్రాన్ని లేపుతున్న క్రమంలో స్లిప్ కావడంతో గాయాలై ఉంటాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సదరు కార్మికుడిని బీజోన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనపై గని మేనేజర్ భూశంకరయ్యను వివరణ కోరగా మిగతా కార్మికులను విచారిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయునికి కాళోజీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అంజయ్య

మామడ(నిర్మల్): మండలంలోని కొరిటికల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు దాసండ్ల అంజయ్యకు కాళోజీ జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 9న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సదరు ఉపాధ్యాయుడిని సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కోచ్ అవార్డు ఫైనల్‌కు నిర్మల్


ఆన్‌లైన్‌లో పాల్గొన్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్: వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు జిల్లా అధికారులు చేసిన కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు దక్కుతోంది. ఒకేరోజు వేలాదిగా రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్(వాననీటి ఇంకుడు గుంతల) నిర్మాణాలను చేపట్టడంపై ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డు పరిశీలనలోకి తీసుకుంది. ఈమేరకు దేశవ్యాప్తంగా వందల్లో వచ్చిన నామినేషన్లలో నుంచి ఫైనల్ జాబితాకు ఎన్నికైన 17 నామినేషన్లలో జిల్లా కూడా ఉందని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు.

నీటిబొట్టును ఒడిసి పట్టేందుకు..

ప్రతీ వాననీటి బొట్టును కూడా ఒడిసిపట్టాలన్న ప్రభుత్వాల పిలుపుమేరకు జిల్లా అధికారులు పలు కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో 2023, జులై 31న జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 5,940 ఇంకుడుగుంతలు నిర్మించారు. మొత్తం ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలన్నింటిలో వీటిని నిర్మింపజేశారు. రికార్డుస్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమం జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ప్రస్తుతం ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు చేపట్టిన నామినేషన్లలోనూ జిల్లా ఫైనల్‌కు చేరుకోవడం హర్షనీయమని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. త్వరలోనే ఫైనల్ ఫలితాన్ని వెల్లడిస్తారని, ఇందులో జిల్లాకు అవార్డు దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నామని తెలిపారు.

ఏఎంవీఐ కొలువు సాధించిన సుందర్


నియామకపత్రం అందుకుంటున్న సుందర్

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సుందర్ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కొలువు సాధించాడు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. ఖమ్మం జిల్లాకు చెందిన తేజావత్ సుందర్ 2016లో ఎన్పీసీఐఎల్(న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియ లిమిటెడ్)లో తొలి ఉద్యోగం, 2018లో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(అసిస్టెంట్ వర్క్ మేనేజర్), ఎస్టీపీపీలో మూడో ఉద్యోగం చేస్తూనే తాజాగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాడు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

జైపూర్(చెన్నూర్): ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం జంగంపల్లికి చెందిన ఎల్కపల్లి రాజేందర్ జైపూర్ పవర్ ప్లాంటులో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. అతని భార్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతనికి కుమారుడు మనోజ్‌కుమార్ (16), కుమార్తె అంజలి సంతానం. కుమారుడు తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

లోకేశ్వరం(ముధోల్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన కసిరే బీరన్న(34) కొంతకాలంగా ఎలాంటి పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం అతి గా మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొర్రెల కొట్టంలో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య గంగామణి, కుమారుడు భరత్, కుమార్తె మనశ్వీ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ..

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బుజాడి తిరుపతి (25)ఆదివారం రాత్రి ఇంట్లో వ్యవసాయ పనులకు వినియోగిస్తున్న పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు మహారాష్ట్రలోని అహేరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మహారాష్ట్రలో మృతి చెందడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు చింతలమానెపల్లి ఎస్సై తెలిపారు.

కలెక్టరేట్‌లో పొర్లుదండాలు


పొర్లుదండాలు పెడుతున్న సాయికిరణ్

నిర్మల్‌చైన్‌గేట్: తనకు రావాల్సిన ఆస్తిని సోదరులు కాజేయాలని చూస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట 28 రోజులు దీక్ష చేసిన నిర్మల్‌కు చెందిన చందుల సాయికిరణ్ సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రజావాణిలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని భావించాడు. కానీ ప్రజావాణి లేకపోవడంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపాడు. తన గోడును ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తన ఇద్దరు సోదరులు తన తండ్రితో కలిసి తనకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి దీక్ష కొనసాగించాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో ఓ ఫైనాన్స్ వ్యాపారిపై కొందరు వ్యక్తులు మద్యం మత్తులో దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌లోని క్రిష్ణ కాలనీకి చెందిన నగమోతు రమేశ్‌కు మరికొందరు వ్యక్తులకు బైక్ ఫైనాన్స్ విషయంలో వాగ్వాదం జరిగింది. సదరు యువకులు రమేశ్‌పై విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచారు. స్థానికులు 100కు సమాచారం అందించడంతో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అన్వర్, కానిస్టేబుల్ తిరుపతి ఘటన స్థలానికి చేరుకునే లోపు సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనన్నారు. రమేశ్ మద్యం సేవించి ఉన్నాడని, వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా సమాచారం ఇవ్వలేదన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.


గాయపడిన రమేశ్